సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 16 ఆగస్టు 2023



సింగరేణిలో స్వాతంత్ర్య వేడుకలు

సింగరేణి ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించారు. డైరెక్టర్ (పా) బలరాం పతాకాన్ని ఆవిష్కరించారు. 10లో



కృష్ణయ్య సేవలు మరువలేనివి

తెల్దారుపల్లి ప్రాంత అభివృద్ధికి తమ్మినేని కృష్ణయ్య చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
33° / 24°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు పునర్వసు పట్టాభిషేకం



స్వామి వారికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకాన్ని ఘనంగా జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని, అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ పతాకావిష్కరణ..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేవస్థాన కార్యాలయం ఈఓ రమాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.159 కోట్ల రుణాలు



చెక్కు అందజేస్తున్న రేగా కాంతారావు, కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ వినీత్

చుంచుపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అర్హత గల మహిళా స్వయం సహాయక సంఘాలకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో రూ.159.16 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు చేతుల మీదుగా మహిళలకు చెక్కులను అందజేశారు. జిల్లాలోని 2,260 మహిళా సంఘాలకు రూ.147.11 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు కాగా, మరో రూ.12.05 కోట్లు స్త్రీనిధి రుణాలు ఉన్నాయి.

నేటి నుంచి సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మె

కొత్తగూడెంఅర్బన్: తమను రెగ్యులర్ చేయాలని కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు బుధవారం నుంచి సమ్మెబాట పడుతున్నారు. 15 ఏళ్లకు పైగా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్నామని, మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నా తమకు సరైన గుర్తింపు లేదని, చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం రెగ్యులర్ ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి, పాత వారిని క్రమబద్ధీకరించాలని, ఆ తర్వాత ఇంకా ఖాళీలు ఉంటే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు. కాగా, బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేసి, విధులు బహిష్కరించి సమ్మె చేసేందుకు జిల్లాలోని 280 మందికి పైగా ఉన్న ఏఎన్‌ఎంలు సిద్ధమవుతున్నారు. దీంతో పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం.

గాంధీజీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కూనంనేని

చుంచుపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చుంచుపల్లి ఎన్‌కే.నగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వారి త్యాగాలకు గుర్తుగా విగ్రహాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సత్యనారాయణ, సర్పంచ్ సుగుణ, మాధవరావు, గోవిందరావు, కృష్ణయ్య, సుదర్శనరెడ్డి, వాసిరెడ్డి మురళి, ఉపసర్పంచ్ మహేష్ పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పయనం





జాతీయ పతాకానికి వందనం చేస్తున్న విప్ రేగా కాంతారావు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న రేగా

'సంపద పెంచు, ప్రజలకు పంచు' నినాదంతో సమగ్రాభివృద్ధి

- స్వాతంత్ర్య, స్వరాష్ట్ర ఫలాలు అందరికీ అందాలి
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- ప్రగతిమైదానంలో జాతీయ పతాకావిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా గణనీయమైన ప్రగతి సాధిస్తున్నామని, సంపద పెంచు, ప్రజలకు పంచు అనే నినాదంతో రాష్ట్రం, జిల్లా ప్రగతిపథంలో పయనిస్తున్నాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. అనేక బలిదానాలతో సాధించుకున్న స్వాతంత్ర్య, స్వరాష్ట్ర ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతిమైదానంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. రైతులకు భరోసా కల్పించేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ వంటివి దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేశామన్నారు. ఆయిల్‌పామ్ సాగును అగ్రస్థానంలో నిలిపామని తెలిపారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుని రెండుపంటలకు నీరందేలా రూ.3.53వేల కోట్లతో సీతారామ ఎత్తిపోతల పథకం, రూ 3.20 వేల కోట్లతో సీతమ్మసాగర్ బహుళార్థ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని వివరించారు.

దళితబంధు చరిత్రాత్మకం..

దళితబంధు పథకం చరిత్రాత్మకమైందని విప్ రేగా కాంతారావు అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన దళితులకు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. మొదటిదశలో 421 యూనిట్లు మంజూరు చేశామని, రెండో దశలో 1,100 మంది లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 743 చెరువుల్లో కోటి 73 లక్షల చేప పిల్లల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. చేపల విక్రయానికి మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు అందిస్తున్నామని తెలిపారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రెండో విడతలో 3,488 మందికి రూ. 61 కోట్ల విలువైన గొర్రెల యూనిట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. సహకారశాఖ ద్వారా విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 2,74,912 ఆహార భద్రత కార్డులు, 8,734 అంత్యోదయ కార్డులు, మూడు అన్నపూర్ణ కార్డుల ద్వారా గత సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జూలై వరకు 62,438 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన

మహిళాభివృద్ధికి చర్యలు..

జిల్లాలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని రేగా కాంతారావు చెప్పారు. స్త్రీనిధి ద్వారా భారీగా రుణాలు అందిస్తున్నామని, వాటితో మహిళలు పలు వ్యాపారాలు చేస్తూ ప్రగతి సాధిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది హరిత హారంలో 10 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో 2,541 మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చామని, గృహలక్ష్మి పథకం కింద 86,773 మంది దరఖాస్తు చేసుకున్నారని, దశల వారీగా అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయని అన్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో 534 కిలోమీటర్ల రహదారులు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 88,289 మంది కార్మికులకు బీమా అమలు చేస్తున్నట్లు చెప్పారు. చుంచుపల్లి మండలం గౌతంపూర్ గ్రామపంచాయతీకి జాతీయ అవార్డు రావడం, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం గర్వకారణమని అభినందించారు. జిల్లాలో 33,744 మంది నిరుద్యోగులు ఉపాధి కల్పనా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోగా 768 మందికి ప్రభుత్వ, 12,865 మందికి ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పించగలిగామని తెలిపారు. జెడ్పీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.23.73 కోట్లతో 1,035 పనులు, ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.23.81 కోట్లతో 799 పనులు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, మిషన్ భగీరథ ద్వారా మారుమూల గ్రామాలకు సైతం తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈజీఎస్ కింద పని చేసిన కూలీలకు రూ. 60.65 కోట్లు చెల్లించామన్నారు. జిల్లాలో1,19,00,396 మందికి నెలకు రూ.26 కోట్ల పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.





గౌరవ వందనం స్వీకరిస్తున్న రేగా, కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్

అటవీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు



ఎఫ్‌బీఓ పిచ్చయ్యకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎఫ్ఓ

చుంచుపల్లి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 15 మంది అటవీ శాఖ సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తగూడెం వనవిహార్‌లో డీఎఫ్ఓ కిష్టాగౌడ్, విజిలెన్స్ డీఎఫ్ఓ రాజారమణారెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కిష్టాగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అడవులు, జంతువుల సంరక్షణలో సిబ్బంది కృషి ఎనలేనిదని అభినందించారు. ఇదే ఉత్సాహంతో జిల్లాను రాష్ట్రంలో అగ్రభాగంలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓలు దామోదర్‌రెడ్డి, అప్పయ్య, ఎఫ్ఆర్ఓ ఉమ, సూపరింటెండెంట్ మూర్తి, సాయి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన డీఎఫ్ఓ

పాల్వంచరూరల్ : జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్ మంగళవారం కిన్నెరసానిని సందర్శించారు. డిర్‌పార్కులోని దుప్పులు, అద్దాలమేడ, కాటేజీలను సందర్శించి, బోట్ షికారు చేశారు. రేంజర్ క్వార్టర్ పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

కిన్నెరసాని గేట్లు ఎత్తివేత



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్ : ఎగువన కురిసిన వర్షానికి కిన్నెరసాని జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి మంగళవారం ఎగువ ప్రాంతాల నుంచి 400 క్యూసెక్కుల వరద నీరు రాగా, నీటిమట్టం 404 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు గేట్లు రెండు ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ సురేష్ తెలిపారు.

నేటి నుంచి 'గాంధీ' సినిమా

కొత్తగూడెంటౌన్: స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం నుండి తొమ్మిది రోజుల పాటు జిల్లాలోని 17 థియేటర్లలో గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రదర్శించే ఈ చిత్రాన్ని చూపించేందుకు వివిధ పాఠశాలల విద్యార్థులను ప్రత్యేక బస్సుల్లో తరలించి, తిరిగి సినిమా పూర్తయ్యాక పాఠశాలల్లో దింపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ 9 రోజుల్లో దాదాపు 10 వేల మంది విద్యార్థులు సినిమా చూసేలా ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. కొత్తగూడెంలో విద్యార్థులతో పాటు కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, డీఆర్ఓ, డీఈఓ, పలువురు అధికారులు కూడా ఈ చిత్రాన్ని వీక్షించనున్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



కేసీఆర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కర్నాటి వెంకటేశ్వర్లు, ముత్యాలరావు

సీఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న కర్నాటి, ముత్యాలరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/దుమ్ముగూడెం : జిల్లా నుంచి ఇటీవల భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయిన అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం ఎంపీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ముత్యాలరావు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. గతేడాది వచ్చిన గోదావరి వరదల్లో చిక్కుకున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలను రక్షించడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించడంతో పాటు పకడ్బందీగా పునరావాస ఏర్పాట్లు చేసినందుకు గాను కర్నాటికి, ఈ ఏడాది వచ్చిన గోదావరి వరదల సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించడంలో ఉత్తమ సేవలందించిన ముత్యాలరావుకు ఈ అవార్డులు అందజేశారు. గోదావరి వరదల అనంతరం చేపట్టిన పారిశుద్ధ్య పనుల్లోనూ ఆయన రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మండల పంచాయతీ అధికారిగా ఎంపికయ్యారు. 2021, 2022 సంవత్సరాల్లో కూడా ఉత్తమ మండల పంచాయతీ అధికారిగా జిల్లా స్థాయిలో అవార్డులు అందుకున్నారు.

వైల్డ్‌లైఫ్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎఫ్ఎస్ఓ నీలమయ్య

పాల్వంచరూరల్ : వన్య మృగాల సంరక్షణ విభాగంలో అత్యుత్తమ సేవలు అందించిన ఎనిమిది మంది సిబ్బందికి స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంగళవారం ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో గట్టుమల్ల ఎఫ్ఎస్ఓ ఈ.క్రాంతికుమార్, రేగళ్ల ఎఫ్ఎస్ఓ సూరయ్య, చాతకొండ ఎఫ్ఎస్ఓ నీలమయ్య, రామాంజగూడెం ఎఫ్‌బీఓ బి.హీరాలాల్, వెంకటాపురం నార్త్ ఎఫ్‌బీఓ బి.శంకర్, వెంకటాపురం ఈస్ట్ ఎఫ్‌బీఓ ఎల్.పవన్‌కుమార్‌తో పాటు వైల్డ్‌లైఫ్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాహుల్, రేగళ్ల ఎఫ్ఆర్ఓ జశ్వంత్‌కుమార్ ఉన్నారు.

కార్డియో సేవలెప్పుడో..?

- అత్యవసర వేళల్లో ఇతర ప్రాంతాలకు..
- పరీక్షించేందుకు వైద్యులు.. పరికరాలకు టెక్నీషియన్ లేరు
- అవస్థలు పడుతున్న హృద్రోగ బాధితులు



కొత్తగూడెంలోని జిల్లా ఆస్పత్రిలో టీ హబ్ సెంటర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ, కొన్ని సేవలందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. అత్యవసర చికిత్స అందించాల్సిన వ్యాధుల్లో గుండె జబ్బు ఒకటి. ఈ వ్యాధికి సరైన సమయంలో వైద్యం అందితే తప్ప ప్రాణాలు నిలబడవు. అలాంటి వైద్య చికిత్స అందించేందుకు, గుండెలో రక్తప్రసరణ ఏ మేరకు జరుగుతుందో, ఎక్కడ బ్లాక్‌లు ఉన్నాయనే విషయాలను తెలుసుకునేందుకు అధునాతన టూడి ఎకో పరికరం కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చింది. కానీ దాన్ని ఉపయోగించే టెక్నీషియన్ పోస్టు భర్తీ చేయకపోవడంతో ఆ పరికరం ప్రస్తుతం మూలన పడింది. దీంతో పాటుగా ఆస్పత్రిలో కార్డియో కు సంబంధించిన వైద్యులు సైతం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో బాధితులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో రాత్రి 12 గంటల తర్వాత ఎంత పెద్ద సమస్య వచ్చినా వైద్యులు అందుబాటులో ఉండరు. సర్వజన ఆస్పత్రిలో కార్డియో పోస్టు ఉన్నప్పటికీ వైద్యులెవరూ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లేలోగా అత్యవసర చికిత్స అందక హృద్రోగుల ప్రాణాలు హరీమంటున్నాయి. ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో టూడి ఎకో కు సంబంధించిన పరీక్ష చేయాలంటే రూ.2,500 వరకు ఖర్చవుతాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆ పరికరం ఉన్నా పరీక్షలు చేసే టెక్నీషియన్, కార్డియో వైద్యులు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారు.

సమయపాలన పాటించరు..

సర్వజన ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ సేవలందించాలి. కానీ కొందరు వైద్యులు 9, 9.30, 10 గంటల సమయాల్లో విధులకు హాజరవుతున్నారు. తిరిగి 12 గంటలకు బయటకు వెళ్తున్నారు. సర్వజన ఆస్పత్రి కావడంతో జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి వివిధ రకాల వ్యాధులతో పరీక్షలు చేయించుకోవడానికి వస్తుంటారు. కానీ 12 గంటలు దాటితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కొంతమంది వైద్యులు సొంత ప్రైవేటు ఆస్పత్రులపై పెట్టిన శ్రద్ధ వేతనం తీసుకునే ప్రభుత్వ ఆస్పత్రిపై పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఆస్పత్రిలో ఓపీ సేవల సమయాన్ని మధ్యాహ్నం 2 గంటల వరకు పెంచాలని పలువురు కోరుతున్నారు. ఇక క్యాజువాలిటీ విభాగం ఉన్నప్పటికీ అత్యవసరమైతే వైద్యం అందించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్పత్రి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని, వైద్యులు సమయపాలన పాటించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

టీ హబ్‌లో టెక్నీషియన్ల కొరత..

కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలోని టీ హబ్‌లో గతంలో 54 రకాల రక్త పరీక్షలు నిర్వహించే వారు. గత జూలై నుంచి 136 రకాల పరీక్షలు నిర్వహించేలా అప్‌గ్రేడ్ అయింది. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల నుంచి రక్త నమూనాలు టీ హబ్‌కు చేరుతాయి. కానీ వాటిని పరీక్షించి సకాలంలో రిపోర్టులు అందించేందుకు సరైన టెక్నీషియన్లు లేరు. రిపోర్టులు వచ్చిన తర్వాతే ఏ డాక్టరైనా వైద్య సేవలు మొదలు పెడతారు. అయితే టీ హబ్‌లో టెక్నీషియన్ల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ వ్యాఖ్యలు సరికాదు

కొత్తగూడెంటౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పోలీసుల గురించి అసభ్యంగా మాట్లాడటం సమంజసం కాదని, వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసుల మనోభావాలను దెబ్బతీసేలా విమర్శిస్తూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ప్రాణాలను పణంగాపెట్టి పనిచేస్తున్నారని వివరించారు.

'డబుల్' ఇళ్ల కోసం చావుకైనా సిద్ధమే..

పెట్రోల్ క్యాన్లతో కాలనీవాసుల దీక్ష



పెట్రోల్ క్యాన్లతో దీక్ష చేస్తున్న మహిళలు

భద్రాచలంటౌన్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం చావడానికైనా సిద్ధమేనని పలువురు మహిళలు పెట్రోల్ క్యాన్లు చేతపట్టుకుని మంగళవారం పట్టణంలోని మనుబోతుల చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. తమకు న్యాయం చేయాలని వారం రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గుడిసెలను తొలగించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు. దీక్షలో మేకల లత, తెల్లం సమ్మక్క, కుమారి, సుహాసిని, రమాదేవి, కృష్ణవేణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి అకృత్యాలపై తల్లిదండ్రుల ఫిర్యాదు



పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

చండ్రుగొండ: కన్నకొడుకు చేస్తున్న అకృత్యాలు భరించలేక తల్లిదండ్రులు మంగళవారం రాత్రి పోలీసులను ఆశ్రయించిన ఘటన ఇది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తుంగారం పంచాయతీ టేకులబంజర్ గ్రామానికి చెందిన గుగులోతు రాందాస్, మంగ ఏకైక కుమారుడైన సాయిదీప్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కిందట అతడికి వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆ యువతి గర్భిణి. మద్యంతోపాటు గంజాయి మత్తుకు బానిసగా మారిన సాయిదీప్, భార్యతోపాటు తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇంట్లో విలువైన వస్తువులను తీసుకెళ్లి అమ్ముకుంటున్నాడు. అతడి వేధింపులు తీవ్రతరం కావడంతో భరించలేక లేక తల్లిదండ్రులే పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

సింగరేణి గనిలో ప్రమాదం

కేటీసీలో కార్మికుడి కాలి పైనుంచి వాహనం వెళ్లగా తీవ్ర గాయం



గాయపడిన రఘును క్యాంపర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

టేకులపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని ఓపెన్‌కాస్ట్‌లో మంగళవారం ఓ కార్మికుడి కాలిపైనుంచి ఓల్వో వాహనం వెళ్లడంతో తీవ్ర గాయమైంది. టేకులపల్లి మండలం బద్దుతండాకు చెందిన హలావత్ రఘు కేటీసీలోని ఎల్ఎస్ఎన్ కంపెనీలో సూపర్‌వైజర్(స్పాకర్)గా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా మంగళవారం మొదటి షిఫ్ట్‌లో కోల్‌బెంచ్ సమీపాన ఆయన పనిచేస్తుండగా ఓల్వో వాహనం డ్రైవర్ గమనించకుండా రఘు వైపు వచ్చాడు. ఇంతలోనే వాహనం టైర్ ఆయన కుడి కాలిపైనుంచి వెళ్లడంతో పాదం నుజ్జునుజ్జయింది. దీంతో ఆయనకు ఇల్లెందు సింగరేణి ఆస్పత్రిలో చికిత్స చేయించిన అనంతరం కొత్తగూడేనికి అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, కేటీసీలో సింగరేణి అంబులెన్స్ ఉన్నా క్యాంపర్ (ట్రాలీ వాహనం)లో రఘును తీసుకెళ్లడాన్ని కార్మికులు తప్పుపడుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091



క్యాంప్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



అశ్వారావుపేట: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు



భద్రాచలం: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య నాయకులు, కార్యకర్తలు



ఇల్లెందు: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్



ఇల్లెందు: జెండా వందనం చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, నాయకులు, కార్యకర్తలు

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



జెడ్పీ సీఈఓ విద్యాలతకు ప్రశంసాపత్రం అందిస్తున్న విప్ రేగా కాంతారావు. చిత్రంలో కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ వినీత్ తదితరులు



మధుసూదన్ రాజు, డీఆర్‌డీఓ; శ్రీనివాసరావు, డీపీఆర్‌ఓ; మరియన్న, ఉద్యాన అధికారి; సంజీవరావు, ఈడీ; జేపీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ; మనోహర్, జిల్లా అధికారి; అర్జున్, ఇరిగేషన్ ఈఈ; భీమ్లా, ఆర్‌అండ్‌బీ ఈఈ; ఎం.సుగుణ, మెడికల్ ఆఫీసర్; ఎస్.జానయ్య, ఎక్సైజ్ ఆఫీసర్; వెంకటేశ్వర్లు, డీసీఓ; రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఎంఓ; శ్రీనివాసరావు, డీటీ; తిరుమల్‌రావు, ఆర్ఐ; ఎం.సోమేశ్వర్, ఎస్ఐ



తిరుపతమ్మ, టీడబ్ల్యూఓఆర్‌జేసీ; ఎం.రాజమల్లు, న్యాయవాది; ఎస్.సత్తిబాబు, దఫేదార్; ఉదయ్‌కుమార్, గన్‌మెన్; జె.శివ, అటెండర్; ముక్తి సావిత్రి, ఏఎన్ఎం; ప్రియాంక, ఆఫీస్ సబార్డినేట్; రామ్మూర్తి, ఆఫీస్ సబార్డినేట్; ఫణికుమార్, ఆఫీస్ సబార్డినేట్; రాము, ఆఫీస్ సబార్డినేట్; రంజిత, జేఏ; ఎస్.రాజు, ఎస్టేట్ ఆఫీసర్; ఎన్.సరిత, డేటా ఎంట్రీ ఆపరేటర్



దేవిడ్‌రాజ్, ఏపీఓ; శ్రీనివాసరావు, కలెక్టర్ డ్రైవర్; ఎ.బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ ఆఫీసర్; సాయిరితీశ్, జేఏ; మహేందర్, డీఎఈఈ; ఎం.చిరంజీవి, ఏఈఈ; నాగానంద్, జేఏ; ఎ.లక్ష్మి, బీసీ హాస్టల్ వర్కర్; జి.సరస్వతి, హెచ్‌డబ్ల్యూఓ; ఎం.దుర్గమ్మ, జేఏ; దీపక్, జేఏ; సిరాజ్, కలెక్టరేట్; కిశోర్, కలెక్టర్ డ్రైవర్

స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం పలువురు అధికారులు, ఉద్యోగులకు విప్ రేగా కాంతారావు, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రశంసాపత్రాలు అందజేశారు.
– సూపర్‌బజార్ (కొత్తగూడెం)

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కొత్తగూడెంలోని ప్రగతి మైదానం, ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పాటశాలల విద్యార్థులు స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న మహనీయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. దేశభక్తి పాటలకు నృత్యాలు చేశారు. త్రివర్ణ పతాకంలోని రంగులను పోలిన దుస్తులు ధరించి నృత్యం చేయడం ఆహూతులను కట్టిపడేసింది. ఈ సందర్భంగా విద్యార్థులను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.
–సాక్షి నెట్‌వర్క్



ప్రకాశం స్టేడియంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



ప్రగతి మైదానంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



దేశభక్తి గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థులు



పట్టణంలోని ప్రైవేట్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

నేటి నుంచి లెప్రసీ సర్వే

- ఈనెల 31లోగా ఇంటింటా వివరాలు సేకరణ
- జిల్లాలో 1,345 బృందాల ఏర్పాటు
- సర్వే వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఇరవై కేసుల నమోదు



శరీరంపై మచ్చలను పరీక్షిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ లెప్రసీ(కుష్టు వ్యాధి) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం నుండి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) పేరిట ఈనెల 31 వరకు కార్యక్రమం కొనసాగుతుంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 1,345 బృందాలను నియమించారు. ఏఎన్ఎం పర్యవేక్షణలో ఆశ కార్యకర్త, మరో వలంటీర్ ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారు. బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఎవరి శరీరంపైన మచ్చలు ఉన్నాయా, ఉంటే అవి ఏ రకం మచ్చలో పరీక్షించి సర్వే పూర్తయిన ఇళ్లకు మార్క్ చేస్తారు. ఆయా బృందాలు సేకరించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా కుష్టు బాధితుల సమాచారం తెలిసిపోతుంది. తద్వారా నేరుగా వారి ఇళ్లకు వెళ్లి మందులు పంపిణీ చేస్తూ వ్యాధి నిర్మూలనకు పాటుపడతారు.

అవగాహన లేకపోవడంతోనే...

ఖమ్మం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం ఇరవై కుష్టు కేసులు నమోదయ్యాయి. ఏప్రిల్ నుండి జూలై వరకు ఈ కేసులు వెలుగు చూశాయి. అలాగే 2021–22 ఏడాదిలో 120 కేసులు, 2022–23 ఏడాదిలో 116 కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా తిరుమలాయపాలెం, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో కేసులు నమోదవుతున్నట్లు గుర్తించగా.. ప్రజల్లో అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈనేపథ్యాన జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

మైక్రో బ్యాక్టీరియం లెప్రేతో వ్యాప్తి

కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే సూక్ష్మ క్రిమి వల్ల సంక్రమిస్తుంది. ప్రధానంగా ఇది చర్మం, నరాలకు సోకుతుంది. అయితే, వ్యాధి లక్షణాలు బహిర్గతమయ్యేందుకు సగటున మూడు నుండి ఐదేళ్లు పడుతుంది. ఈ వ్యాధి వంశపరంపర్యంగా రాకున్నా... వయస్సు, లింగభేదం లేకుండా ఎవరికైనా సోకే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. కుష్టువ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువ, స్పర్శ లేని ఎర్రని రాగి లేదా గోధుమ రంగు కలిగి ఉంటాయి. కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, చమట రాకుండా వచ్చే మచ్చలతో పాటు చేయిలేదా పాదాల వేళ్లు వంకర పోవడం ఈ వ్యాధి లక్షణం. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభిస్తే ఆరు నెలల నుంచి 12నెలల్లో పూర్తిగా నయమవుతుంది. రెండు లేక మూడు ఔషధాల కలయిక అయిన బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) చేస్తారు. ఈ చికిత్స అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిగా ఉచితంగా లభిస్తుంది.

పూర్తిగా రూపు మాపేందుకే...

కుష్టు వ్యాధి కేసులు గతంలో మాదిరి తీవ్రంగా పెరగడం లేదు. అయినప్పటికీ వ్యాధిని పూర్తిస్థాయిలో రూపుమాపేందుకు ప్రభుత్వం ఎల్‌సీడీసీ నిర్వహిస్తోంది. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరగా నయమయ్యే అవకాశముండడంతో ఇంటింటి సర్వేకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వ్యాధి నిర్మూలనకు మైకుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

నెల రోజుల్లోగా రైతులకు సాగునీరు

ఎస్సారెస్పీ కాల్వల తవ్వకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందాల



ఎమ్మెల్యే కందాలను సత్కరిస్తున్న సీఈ శంకర్‌నాయక్

కూసుమంచి: పెండింగ్‌లో ఉన్న శ్రీరాంసాగర్ 7 ఆర్ కాల్వల తవ్వకం శరవేగంగా పూర్తిచేసి నెల రోజుల్లోగా ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. కూసుమంచి వద్ద పెండింగ్‌లో ఉన్న కాల్వ తవ్వకం పనులను జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, రైతులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిహారం పెంచేలా తాను ప్రభుత్వాన్ని ఒప్పించడంతో పదేళ్ల సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. ఈసందర్భంగా సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేను సీఈ శంకర్‌నాయక్, రైతులు సత్కరించారు. ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు ఇంటూరి శేఖర్, రామసహాయం బాలకృష్ణారెడ్డి, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయించిన ఎమ్మెల్యే

పాలేరు రిజర్వాయర్ నుండి పాలేరు కాల్వకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సాగునీరు విడుదల చేయించారు. ప్రస్తుతం కాల్వ కింద వరినాట్లు వేస్తుండగా అధికారులు నీటిని నిలిపేయడంతో రైతులు ఎమ్మెల్యేను కలిశారు. దీంతో ఆయన సీఈ శంకర్‌నాయక్‌తో మాట్లాడి రిజర్వాయర్ వద్దకు తీసుకెళ్లి నీటిని విడుదల చేయించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని సివిల్‌లైన్‌కు చెందిన తన సోదరి బానోత్ సీత కనిపించకుండా పోయిందని అక్క అంగోత్ నీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ మంగళవారం తెలిపారు. కారేపల్లి మండలం పోలెంపల్లి గ్రామానికి చెందిన సీత.. తన భర్త వినయ్‌తో ఏర్పడిన విభేదాలతో ఇల్లెందులోని అక్క నీల ఇంటికి వచ్చింది. రెండు రోజులు ఇల్లెందులోనే ఉన్న సీత జూలూరుపాడులో ఉన్న మరో అక్క వద్దకు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరింది. కానీ, అక్కడకు చేరుకోకపోవడంతో అనుమానంతో సోదరి నీల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వర్షంతో పత్తికి జీవం

ఎరువులు వేసే పనిలో రైతుల బిజీబిజీ

గత నెలలో దంచిన కొట్టిన వానలు ఈ నెల మళ్లీ ముఖం చాటేశాయి. దీంతో పత్తి మొక్కలు వడలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. ఈనేపథ్యాన మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం పత్తి పంటకు జీవం పోసింది. దీంతో రైతులు పంటకు ఎరువులు వేయడంలో నిమగ్నమయ్యారు. ఇక మిర్చి తోటలు కూడా వేసేందుకు సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షం అనుకూలించిందనే చెప్పాలి. - తిరుమలాయపాలెం



తిరుమలాయపాలెంలో పత్తికి వేసేందుకు ఎరువు సిద్ధం చేస్తున్న రైతు

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

పోలీస్ వాహనాల్లో క్షతగాత్రులను తరలించిన సీఐ, ఎస్‌ఐ



గాయపడిన ప్రయాణికులు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట, బీజీకొత్తూరు మధ్య మణుగూరు – కొత్తగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు తమ వాహనాల్లో ఆస్పత్రికి తరలించారు. మణుగూరు మండలం కూనవరానికి చెందిన ఎండీ ఇజహార్ అతడి భార్య సాజీద, కమలాపురానికి చెందిన బుడిగల వెంకటరమణ, పినపాక మండలం గడ్డంపల్లికి చెందిన పడిగ వీరకుమార్ అతడి భార్య రాధ, అశ్వాపురం మండలం మంచికంటినగర్‌కు చెందిన కారం సీతమ్మ.. టీఎస్28టీబీ1026 నంబర్ గల ఆటోలో భద్రాచలం వెళ్తున్నారు. మొండికుంట గ్రామ శివారులో సువ్వల మోరి వద్ద పాల్వంచ నుంచి మణుగూరు వస్తున్న టీఎస్05ఎఫ్‌జీ 3540 నంబర్ గల కారు ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న నలుగురికి కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108కు రాకపోవడంతో సీఐ రవీందర్ ఘటనా స్థలానికి చేరుకొని ఎస్‌ఐ తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది, స్థానికులతో కలిసి క్షతగాత్రులను రెండు పోలీస్ వాహనాల్లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. సీఐ స్పందనపై సర్వత్రా ప్రశంసలు వచ్చా యి. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ అవినాష్ కుమార్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఫైదుల్లా (ఫైల్)

గుండాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆళ్లపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే ఫైదుల్లా (30) స్థానిక ఆంధ్రా బ్యాంకులో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల కిందట పాల్వంచకు చెందిన ఆమీనోతో వివాహం జరిగింది. ఇంట్లో గొడవల కారణంగా ఆమీనో ఏడాది కిందట పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన ఫైదుల్లా మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కుమారుడున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. రైతు మృతి



హరిబాబు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టరు ఇంజన్ బోల్తా పడి ఓ రైతు దుర్మరణం చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడేనికి చెందిన హలావత్ హరిబాబు (28), గ్రామ సమీపంలోని రాళ్లవాగు చెరువు దగ్గర ఉన్న మూడు ఎకరాల పొలంలో మినుములు చల్లించి, ట్రాక్టరుతో దుక్కి చేయించాడు. దుక్కి పనులు ముగిసిన తర్వాత డ్రైవరు ట్రాక్టర్‌ను పొలం గట్టుపై నిలిపి, బహిర్భూమికి వెళ్లాడు. అదే సమయంలో హరిబాబు ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపేందుకు స్టార్ట్ చేసి పొలం గట్టు ఎక్కిస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. హరిబాబుపై పూర్తిగా ఇంజన్ భాగం పడిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

ములకలపల్లి: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మాధారం గ్రామశివారులో పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించి, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. రూ.4,160 నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమల్‌రావు తెలిపారు.

జూదరులపై కేసు

దమ్మపేట: మండలంలోని మల్లిగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం మల్లిగూడెం శివారులోని పామాయిల్ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ రవికుమార్, సిబ్బందితో కలసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని, రూ.6,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ఉప ఎన్నికల్లోనూ సగానికిపైగా ఏకగ్రీవాలు

- 66 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంటే 32 ఏకగ్రీవం.. మరో 32 చోట్ల పోటీ

సాక్షి, అమరావతి: ఏపీలో 484 మండలాల పరిధిలో మొత్తం 1,033 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో సగానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 66 సర్పంచ్ స్థానాలతో పాటు 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా, సోమవారం సా.3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు.. సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగే మొత్తం 66 గ్రామాల్లో 32 చోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా, రెండుచోట్ల అభ్యర్థులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. కేవలం 32 చోట్ల మాత్రమే సర్పంచ్ స్థానాలకు ఈనెల 19న పోలింగ్ జరగనుంది. మరోవైపు.. 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికలు జరుగుతుండగా.. 757 స్థానాలు ఏకగ్రీవం కాగా, 261 చోట్ల 19న పాలింగ్ జరగనుంది.

పుంగనూరు నిందితులంతా పాత నేరస్తులు

దాడుల కోసం పార్టీలో గూండాలను ఎంపిక చేసి మరీ తెచ్చిన టీడీపీ

సాక్షి, చిత్తూరు, పుంగనూరు (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇటీవల తెలుగుదేశం పార్టీ సృష్టించిన విధ్వంసంలో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. పక్కా ప్రణాళిక, భారీ వ్యూహంతోనే ఈ దాడులు జరిగినట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా అణగదొక్కటమే లక్ష్యంగా టీడీపీ ఈ దాడులకు వ్యూహ రచన చేసింది. పక్కా ప్రణాళికతో జిల్లా నలుమూలల నుంచి టీడీపీకి చెందిన గుండాలను ఎంపిక చేసి మరీ పుంగనూరుకు తెచ్చినట్లు వెల్లడైంది. వారిపై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. వీరిని ముందుగానే మారణాయుధాలతో సహా పుంగనూరులో మోహరించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అంటరానితనంపై యుద్ధం

విజయవాడలో 77వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

"అంటరానితనం అంటే ఫలానా వ్యక్తులు తాకటానికి వీల్లేదని భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు.. వారికి అందాల్సిన సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే.. అలాంటి రూపం మార్చుకున్న అంటరానితనంపై ఈ రోజు మనం యుద్ధం చేస్తున్నాం! పేదలు గెలిచేదాకా, వారి బతుకులు బాగుపడే వరకు ఇది కొనసాగుతుంది. - ఏపీ సీఎం వైఎస్ జగన్"

- భౌతికంగా దూరం పెట్టడం ఒక్కటే కాదు.. సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే
- మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ దళాల వందనాన్ని స్వీకరించిన సీఎం


విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రూపం మార్చుకున్న అంటరానితనం, పేద వర్గాలను అణచివేస్తున్న పెత్తందారీ భావజాలం ధోరణులపై ఈ నాలుగేళ్ల పాలనలో యుద్ధాన్ని ప్రకటించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం జగన్ సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహనీయుల త్యాగనిరతి, స్వాతంత్ర్య సమర యోధుల బలి దానాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో మరే ప్రభుత్వం, రాష్ట్రం చేయని గొప్ప మార్పులు, గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని నాలుగేళ్లలోనే తెచ్చామని చెప్పారు. '76 ఏళ్ల ప్రయాణంలో మన దేశం, రాష్ట్రం ఎంతో పురోగమించాయని చెప్పేందుకు పలు ఉదాహరణలు కనిపిస్తాయి. ఆర్థిక వ్యవస్థకు మూలమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు లాంటి మూడు రంగాలలో ఎంతో ప్రగతి కనిపిస్తుంది. కానీ అదే సమయంలో ఈ వేగాన్ని అందుకోలేని, అందుకునే అవకాశాలు తగినంతగా లభించని కుటుంబాలు, వర్గాలు, సామాజిక వర్గాలు, ప్రాంతాలు ఈ ఏడు దశాబ్దాల ప్రయాణంలో ఇంకా వెనకబడే ఉన్నాయి' అని పేర్కొన్నారు. సీఎం జగన్ తన ప్రసంగంలో ఇంకా ఏమన్నారంటే..

రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలం..

అంటరానితనం అంటే కేవలం భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు! పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో ఆ గవర్నమెంట్ బడిని పాడు పెట్టడం! డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేదల పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేద బిడ్డలు తెలుగు మీడియంలోనే చదవాలని బరితెగించి వాదించటం కూడా అంటరానితనమే! పేదలు ఏ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారో అక్కడ ఉచిత సేవలు అందకుండా చేయటం, పేదలు ఏ బస్సు ఎక్కుతున్నారో ఆ బస్సును ప్రైవేట్‌కు విక్రయించాలని చూడటం, పేదలు కోరుకునే చిన్నపాటి ఇంటి స్థలం, ఇంటిని వారికి ఇవ్వకుండా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం, చివరికి కోర్టుల్లో రకరకాల కేసులు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వటానికి వీల్లేదని అడ్డుకోవటం కూడా అంటరానితనమే! పౌర సేవలు ఏవి కావాలన్నా పేదలు, మధ్యతరగతి వర్గాల వారు కార్యాలయాలు, కమిటీల చుట్టూ తిరిగేలా వారి సహనాన్ని పరీక్షించటం, అవ్వాతాతలు పెన్షన్ అందుకోవాలన్నా, రైతన్నలకు ఎరువులు కావాలన్నా పొద్దున్నే లేచి పొడవాటి క్యూల్లో నిలబడి, చివరికి ఆ క్యూ లైన్లలో మనుషులు చనిపోతున్నా పాలకుల గుండెలు కరగకపోవటం... ఇవన్నీ రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలంలో భాగాలే. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అలాగే మిగిలి ఉన్న, రూపం మార్చుకున్న అంటరానితనంపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వం మనది. పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడేవరకూ ఈ యుద్ధం కొనసాగుతుంది.



మెడల్స్ ప్రదానం సందర్భంగా కింద పడిపోయిన మెడల్‌ను తీసి పోలీస్‌కు పిన్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దుష్ట సంప్రదాయాన్ని తుదముట్టించాం

ఎన్నికల సమయంలో ప్రకటించే మేనిఫెస్టోను ఆ తరువాత చెత్తబుట్టలో పడేసే దుష్ట సంప్రదాయాన్ని మనం తుదముట్టించాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఇందులో ఇవి చెప్పాం.. ఇవి చేశాం.. 98.5 శాతం వాగ్దానాలను ఇప్పటికే అమలు చేశామని ప్రింట్ తీసి మరీ గడప గడపకూ వెళ్లి చూపిస్తూ ప్రజల ఆశీస్సులు తీసుకుంటున్నాం. సామాజిక న్యాయం అన్నది కేవలం నినాదం కాదు.. అది అమలు చేయాల్సిన విధానమని నిరూపిస్తూ మంత్రి మండలిలో ఏకంగా 68 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చాం. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. వికేంద్రీకరణను విధానంగా మార్చుకుని రాష్ట్రం ఏర్పడిన తరవాత మరో 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. రాజధానులను కూడా మూడు ప్రాంతాల హక్కుగా, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా వికేంద్రీకరణ చేయబోతున్న ప్రభుత్వం కూడా మనదే. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే లబ్ధిదారులైన ప్రజలకు చేరుతున్నాయని దాదాపు 38 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయి. గత 50 నెలల్లో ఎలాంటి అవినీతి, లంచాలు, వివక్షకు తావు లేకుండా ఏకంగా రూ.2.31 లక్షల కోట్లను అత్యంత పారదర్శకంగా పేదలకు అందించాం. డీబీటీతో నేరుగా ఖాతాల్లోకి జమ చేశాం. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. మహిళా సాధికారతకు బాటలు వేశాం. సోషల్ ఆడిట్‌ను తప్పనిసరి చేయటం ద్వారా పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తున్నాం.

2047 నాటికి | ఏపీని నంబర్ వన్ చేస్తా

- అభివృద్ధి ఆలోచనలన్నీ నావే
- హైదరాబాద్‌లో స్కూల్ నుంచి వర్సిటీ వరకు నేనే అభివృద్ధి చేశా
- అవినీతి, నేరాల్ని కాపాడుకుంటే సంక్షేమం పరుగులు పెడుతుంది
- సంస్కరణల ఫలితంగా కోవిడ్‌లోనూ గ్రోత్ వచ్చిన రాష్ట్రం ఇండియా
- ఇంజనీరింగ్ చేయాలంటే బైపీసీ చదవాలి
- ఇండియా విజన్–2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో చంద్రబాబు




సాక్షి, విశాఖపట్నం : మళ్లీ తనని అధికారంలోకి తీసుకొస్తే.. 2047 నాటికల్లా ఆంధ్రప్రదేశ్‌ని నంబర్ వన్ చేస్తానని, తనని గెలిపించే బాధ్యత మీరు తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. చంద్రబాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌టీ) సంస్థ రూపొందించిన ఇండియా విజన్–2047 డాక్యుమెంట్‌ని ఆయన మంగళవారం విశాఖ ఎంజీఎం గ్రౌండ్స్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటేనే సంక్షేమం పరుగులు పెడుతుందని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినా అవినీతి పోలేదని, అందుకే ఫ్రీ ఫ్రం కరెప్షన్, ఫ్రీ ఫ్రం క్రైమ్ అనే నినాదంతో ముందుకెళ్దామని అన్నారు. పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ4) మోడల్‌తో పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. బటన్ నొక్కడం వల్ల ఎవరికి లాభమో చూడాలే తప్ప, ఉత్తుత్తి బటన్‌లు నొక్కడం కాదన్నారు. విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, టెలికమ్యూనికేషన్, హైవేల నుంచి దేశంలో అమలైన ప్రతి ఒక్కటీ తన ఆలోచనే అని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు తన వల్లే అభివృద్ధి చెందాయన్నారు. డబ్బులు ఎలా సంపాదించాలో చాలా మందికి నేర్పించానన్నారు.

విజన్ డాక్యుమెంట్ అట్టర్‌ఫ్లాప్

ఇండియా విజన్–2047 పేరుతో చంద్రబాబు చేసిన షో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్న సభలో చెప్పిన మాటలే చెప్పి, తానే గొప్పంటూ డబ్బా కొట్టుకొని, అందులోనూ సవాలక్ష తప్పులు చెప్పడంతో అందరూ మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు మాట్లాడుతుండగానే 80 శాతం ఖాళీ అయిపోయింది. ఆయన రావడమే రెండు గంటలు ఆలస్యం. వచ్చీ రాగానే అడ్డగోలు అబద్ధాలు చెబుతుండటంతో అందరూ విసుక్కొంటూ వెళ్లిపోయారు. ఆర్థిక సంస్కరణల ఫలితంగా కోవిడ్ సమయంలోనూ గ్రోత్ వచ్చిన ఏకైక రాష్ట్రం భారత్ అని చెప్పడంతో అందరూ నవ్వుకున్నారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు అన్నీ తానే అభివృద్ధి చేశానని, ఆర్థిక సంస్కరణలకు బాటలు వేశానని, విద్యుత్ నుంచి రోడ్ల వరకూ ఎలా డెవలప్ చెయ్యాలో కేంద్రానికి రిపోర్టులు ఇచ్చిందీ తానే అని అనడంతో అందరూ విస్తుపోయారు. ఇంటర్‌లో ఇంజినీర్ కావాలంటే బైపీసీ చదవాలని చెప్పడంతో అందరికీ బుర్రలు తిరిగిపోయాయి. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటనే సంక్షేమం పరుగులు పెడుతుందని ఓ సందర్భంలో చెప్పడంతో విన్న వారందరూ అవాక్కయ్యారు.

ఇక విజన్ 2047పై దృష్టి

- మహిళా నేతల సమావేశంలో పవన్‌కళ్యాణ్
- ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ



సాక్షి, అమరావతి: విజన్–2020 అయిపోయిందని.. ఇకపై విజన్–2047పై దృష్టి పెట్టాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పార్టీ మహిళా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజన్ 2047 గురించే ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నారన్నారు. ప్రస్తుతం 2023 నడుస్తోందని.. 2047 నాటికి ఉపాధి అవకాశాలు బాగుండాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తాను కోరుకుంటున్నానన్నారు. పెరుగుతున్న సంపద అంతా రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొంది దోపిడీ చేసే కొందరి వద్దే పేరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కట్టినా ముఖ్యమంత్రులకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని.. ఆంధ్రాలో అయితే 8 శాతం అంటున్నారన్నారు. సరైన వ్యక్తులకు ఓటు వేయకపోతే 2047 కల్లా మన బిడ్డలను మనమే సర్వనాశనం చేసుకుంటామని వ్యాఖ్యానించారు.

పథకాలేవీ ఆగవు

వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకపోతే పథకాలు ఆగిపోతాయేమో.. సంక్షేమం నిలిచిపోతుందేమో అనుకోవద్దని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రస్తుత పథకాల కంటే పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలే ఉంటాయి తప్ప ఈ పథకాలు తీసేసే పరిస్థితి ఉండదన్నారు. ప్రతి ఒక్కరికీ మాట ఇస్తున్నానని.. జగన్‌ను ఎన్నుకోకపోతే ఏం జరుగుతుందో అనే మాట అవసరం లేదన్నారు.

జిల్లా వార్తలు

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య


తిరుమల ఆలయం వద్ద కుటుంబంతో ఎమ్మెల్యే సండ్ర


కేసీఆర్‌కు ప్రసాదం అందచేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి: తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామి వారిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకోగా అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి హైదరాబాద్ చేరుకున్న ఎమ్మెల్యే సండ్ర.. సీఎం కేసీఆర్‌ను కలిసి తిరుమల ప్రసాదం అందించడంతో పాటు తన పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు తీసుకున్నారు.

కిన్నెరసానిలో మువ్వన్నెల రెపరెపలు


త్రివర్ణ పతాకంతో రిజర్వాయర్‌లో తిరుగుతున్న స్పీడ్‌బోట్

పాల్వంచరూరల్: పంద్రాగస్టు సందర్భంగా పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. టూరిజం కార్పొరేషన్‌కు చెందిన స్పీడ్ బోట్‌కు త్రివర్ణ పతాకాన్ని కట్టి జలాశయంలో తిప్పిన ఆపరేటర్లు, సిబ్బంది దేశభక్తిని చాటుకున్నారు.

ఒక్క రోజు ఆదాయం రూ.47,625

పంద్రాగస్టు సందర్భంగా కిన్నెరసానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా 1,005మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.29,475తో పాటు 300మంది జలాశయంలో బోటు షికారు చేయడంతో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.18,150 ఆదాయం సమకూరింది.

మహనీయుల త్యాగాలు నిత్య స్మరణీయం

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్


భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన మహనీయుల త్యాగాలు నిత్య స్మరణీయమని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్‌రాజ్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారి జీవిత పాఠాలను నేటి విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాగా, గిరిజనులకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఐటీడీఏ ద్వారా అందేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు భీమ్, మణెమ్మ, తానాజీ, విజయ్‌కుమార్, సురేశ్‌బాబు, అశోక్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, మునీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

అనేక మంది త్యాగమే స్వాతంత్ర్యం

సింగరేణి(కొత్తగూడెం): ఎందరో మహనీయుల త్యాగఫలితమే నేటి స్వాతంత్ర్యమని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆయన గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాక జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే, సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ జాతీయ జెండా ఎగురవేశారు. కాగా, ప్రకాశం స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సింగరేణివ్యాప్తంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని డైరెక్టర్లు బలరాం, శ్రీనివాస్ సన్మానించి మాట్లాడారు. అనేక పోరాటాలు, ఎందరో త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించగా.. స్వరాష్ట్ర నినాదంతో తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిలో 33 శాతం వృద్ధి, రవాణాలో 39శాతం వృద్ధి సాధించామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణతో పాటు అధికారులు, నాయకులు కట్టా బసవయ్య, బి.హన్మంతరావు, బి.వెంకట్రావ్, రియాజ్ అహ్మద్, త్యాగరాజన్, మందా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో గౌరవవందనం స్వీకరిస్తున్న డైరెక్టర్ బలరాం

డీసీసీబీలో..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు సాధించిన ప్రగతి, వివిధ వర్గాలకు ఇస్తున్న రుణాలు, రాయితీల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


ఖమ్మం డీసీసీబీలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న చైర్మన్ నాగభూషణం, తదితరులు

కృష్ణయ్య సేవలు మరువలేనివి..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని కృష్ణయ్య ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెల్దారుపల్లిలో మంగళవారం జరిగిన కృష్ణయ్య ప్రథమ వర్ధంతి సభలో తుమ్మల పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కృష్ణయ్య అనునిత్యం గ్రామాభివృద్ధికి పరితపించేవారని, ఆయన లేనిలోటు ప్రజలకే కాక తనకూ తీర్చలేనిదని చెప్పారు. కృష్ణయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణయ్య ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమ, కార్మికుల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బండి జగదీష్, జొన్నలగడ్డ రవికుమార్, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.


వర్ధంతి సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వనజీవి రామయ్యకు పెరిగిన వేతనం


రామయ్య దంపతులకు రూ.50 వేల చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంసహకారనగర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యకు ఇప్పటి వరకు రూ.40 వేల గౌరవ వేతనం అందుతోంది. ఈ నగదును మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు వినియోగిస్తున్నారు. తాజాగా ఈ వేతనాన్ని రూ.50 వేలకు పెంచగా.. అందుకు సంబంధించిన చెక్కును ఖమ్మంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందజేసి రామయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, డీఆర్డీఓ విద్యాచందన, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వీరుల త్యాగాలతోనే స్వాతంత్ర్యం

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: ఎందరో వీరులు ప్రాణాలకు తెగించి చేసిన పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం లభించిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని రఘునాథపాలెంలో మంగళవారం ఆయన జాతీయ జెండా ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుడు తక్కెళ్లపల్లి మీనారావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశం కోసం పోరాడిన వారిని స్మరించుకునేందుకు మేరా మిట్టీ.. మేరీ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమరులు నడయాడిన ప్రాంతాల నుంచి మట్టిని సేకరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నైజాం నవాబును ఎదిరించి ప్రాణత్యాగం చేసిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ విగ్రహానికి సుబ్లేడులో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, మేక సంతోష్‌రెడ్డి, బొడ్డుపల్లి ప్రసాద్, మునేశ్, శరత్, వీరభద్రం, గోవర్దన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


సుబ్లేడులో షోయబుల్లాఖాన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు